క్లుప్తంగా

జిల్లా అధ్యక్షుడి పదవీ స్వీకారాన్ని విజయవంతం చేయాలి

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి మేరుగు నాగార్జున సోమవారం ఉదయం 10 గంటలకు బాపట్లలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో పదవీ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అద్దంకి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

బల్లికురవ: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మంగళవారం నుంచి నవంబర్ 2వ తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కూకట్లపల్లి, గురువారం ముక్తేశ్వరం, శుక్రవారం ఎస్ఎల్ గుడిపాడు, శనివారం వైదన, 29 మంగళవారం వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, 30 వేమవరం, నవంబర్ 1 బల్లికురవ, 2 కొప్పరపాడు గ్రామాల్లో జరిగే సదస్సులకు రైతులందరూ హాజరై భూసమస్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దార్ కోరారు.

వృద్ధులకు పండ్లు, అల్పాహారం పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న రోటరీ అధ్యక్షుడు

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని నేతాజీ వృద్ధాశ్రమంలో 25 మంది వృద్ధులకు పండ్లు అల్పాహారం పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. ఆదివారం రోటరీ సభ్యులతో కలిసి కృష్ణమోహన్ దంపతులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలు గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈర్ల గంగమ్మకు మకర తోరణం


భక్తులు అందజేసిన మకరోరణం

బల్లికురవ: కొణిదెన రెవెన్యూలోని ఈర్లగంగమ్మకు పలువురు భక్తులు మకర తోరణాన్ని అందజేశారు. నక్కబొక్కలపాడు గ్రామస్తులు, గ్రానైట్ దారుల సహకారంతో ఇటీవల కాలంలో ఆలయాన్ని అభివృద్ధితోపాటు బల్లికురవ, సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఆలయానికి వెళ్లే రోడ్డును సిమెంట్ రోడ్డు మార్చారు. ఆశ్వయుజ మాసం తదియ సందర్భంగా బల్లికురవ, నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొప్పరపాలెం, గ్రామాల్లోని భక్తులు అమ్మవారి సన్నిధికి చేరి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ

కారంచేడు: గ్రామాలను అభివృద్ధి పథంలో ఉంచేందుకు ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎంపీడీవో నేతాజీ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రం కారంచేడు, కుంకలమర్రు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన స్థానిక నాయకులతో కలసి భూమిపూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు యార్లగడ్డ అక్కయ్య చౌదరి, ఆదిలక్ష్మి, కంబంపాటి నరేంద్ర, జాగర్లమూడి నాని, హౌసింగ్ ఏఈ షేక్ ఖాశీం సాహెబ్, పీఆర్ జేఈ దాసు, కార్యదర్శి, ఇతర శాఖ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

అక్షర భగీరథుడు రావూరి భరద్వాజ


సుబ్బారావుకు అవార్డును ప్రదానం చేస్తున్న అతిథులు

చీరాల అర్బన్: కలాన్ని కన్నీళ్లతో నింపి సాహిత్య సారస్వతాన్ని సృజించిన అక్షర భగీరథుడు, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ అని.. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని ప్రముఖ సాహితీవేత్త, రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి అన్నారు. డాక్టర్ రావూరి భరద్వాజ సాహితీ సమితి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం రావూరి భరద్వాజ 11వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అంగలకుదిటి నాగవీరభద్రాచారి అధ్యక్షత వహించిన మాట్లాడుతూ కేవలం పదోతరగతి వరకు చదువుకున్న రావూరి భరద్వాజ జ్ఞానపీఠ అవార్డు పొందడం వారి నిత్య సాహితీ కృషికి నిదర్శమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, గేయ రచయిత కె. సుబ్బారావుకు భరద్వాజ సాహితీ పురస్కారాన్ని కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ వి.ఉమారాఘవేంద్ర అందించారు. కార్యక్రమంలో కట్టా రాజ్ వినయ్‌కుమార్, వడలి రాధాకృష్ణ, కోడూరి ఏకాంబరేశ్వర బాబు, గాదె హరిహరరావు, ఎ.రామారావు, ఎ.లక్ష్మణాచారి, హరిహరప్రసాద్, పి.శివాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.


కొప్పరపాడు చెత్తనుంచి సంపద కేంద్రంలో మద్యం సీసాలు


బల్లికురవ సమీపంలో చెరువు అంచుల్లో పడేసిన వ్యర్థాలు



కొప్పరపాడులో మందుబాబులకు అడ్డాగా చెత్త నుంచి సంపద కేంద్రం

కూటమికి చెత్తశుద్ధి ఉందా ?

- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- రోడ్లవెంబడి, చెరువు కట్టలపై వ్యర్థాలు
- స్థలాల కేటాయింపులో జాప్యం
- అధికారుల మొద్దునిద్ర

బల్లికురవ:

'ఇది మంచి ప్రభుత్వం.. తమ్ముళ్లు ఈ ఐదు నెలల్లో మనం చేసిన మంచిపనిని ప్రతి గడపకు తీసుకెళ్లాలి..' అంటూ కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలివి. తీరా చూస్తే క్షేత్రస్థాయిలో చూస్తే జనం ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఈఐదు నెలల కాలంలో సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేశారని.. ఇంటింటికి వచ్చి ఇది మంచి ప్రభుత్వం ఎలా చెప్తారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉంది కూటమి ప్రభుత్వ పాలన. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలను పూర్తిగా గాలికొదిలేసింది. కేవలం పింఛన్లు, నాణ్యమైన మందు అంటూ హడావుడి చేసిందే తప్ప ప్రజలకు ఒరిగింది శూన్యం అని ప్రజలు చర్చించుకుంటున్నారు. పంచాయతీలు అయితే పారిశుద్ధ్యం లేక కంపు కొడుతున్నాయి. ప్రభుత్వం ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణతో గ్రీన్ అంబాసిడర్‌ల ద్వారా చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. ఏడేళ్ల క్రితం మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన ఒక్కో పంచాయతీకి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి.

14 పంచాయతీల్లో నిర్మాణాలు..

అప్పట్లో నక్కబొక్కలపాడు, కె.రాజుపాలెం, వేమవరం, ఉప్పమాగులూరు, కొప్పరపాలెం, గుంటుపల్లి, పెదఅంబడిపూడి, వైదన, కొప్పరపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, గొర్రెపాడు, ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, పంచాయతీల్లో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సేకరించిన వ్యర్థాలను సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీతో ఆదాయం పెంచుకోవచ్చు. ఈ కంపోస్టు తయారీ పట్ల పంచాయతీలు, అధికారులు, శ్రద్ధ చూపటం లేదు.


వల్లాపల్లిలో రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు ఇలా..

పిల్లర్ల దశలోనే..

మల్లాయపాలెం, కొణిదెన, కొమ్మినేనివారిపాలెం గ్రామాల్లో సంపద కేంద్రాల నిర్మాణం రెండేళ్లగా పిల్లర్లు దశలోనే నిలిచిపోయాయి. అధికారులు పనులు పూర్తిచేయాలని చెప్తున్నా సర్పంచ్‌లు ఇదిగో అదిగో అంటున్నారే తప్ప పనులు పూర్తిచేయడం లేదు.


మల్లాయపాలెంలో ముందుకు సాగని సంపద కేంద్రం

4 పంచాయతీల్లో స్థల సేకరణలో జాప్యం..

బల్లికురవ, చెన్నుపల్లి, వల్లాపల్లి, కూకట్లపల్లి పంచాయతీల్లో స్థలాలు కేటాయించాలని ఎంపీడీవో, ఈవోఆర్డీ రెండేళ్లుగా రెవెన్యూ అధికారులకు విన్నవిస్తున్నారు. కాని రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ గ్రామాల్లో వ్యర్థాలను రోడ్ల వెంబడి చెరువు కట్టపై పడవేస్తూ తగలబెడుతున్నారు. ఈ పొగతో వాహనదారులు, ప్రజల అవస్థలు పడుతున్నారు. కొప్పరపాడు గ్రామ సమీపంలో నిర్మించిన చెత్తనుంచి సంపద కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. చెత్తసేకరణ జరగనందున మందుబాబులు తమ అధీనంలోకి తీసుకున్నారు. అక్కడే మద్యం తాగుతూ నానా హంగామా చేస్తున్నారు.

> **వినియోగంలోకి తెస్తాం..**
> సంపద కేంద్రాలోని వ్యర్థాల ద్వారా వర్మీకంపోస్టు తయారీతో ఆదాయం పెంచుకోవాలి. ఏడు పంచాయతీల్లో అసంపూర్తి పనులు, స్థలాలు కేటాయింపులో జాప్యంతో వినియోగంలో లేవు. వినియోగంలోకి తెచ్చేందుకు సర్పంచ్‌లు, రెవెన్యూ శాఖతో మాట్లాడుతాం.
> – దాసరి సుమతి, ఈవోఆర్డీ

ఇప్పటికైనా అధికారులు కాస్త శ్రద్ధ చూపి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

> **అసంపూర్తి పనులు పూర్తిచేయాలి..**
> 
> మల్లాయపాలెం గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన చెత్త నుంచి సంపద కేంద్ర నిర్మాణ పనులు పూర్తితో వినియోగంలోకి తేవాలి. ప్రస్తుతం గ్రీన్ అంబాసిడర్లు సోమవరప్పాడు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా వ్యర్థులను పడవేసి తగలబెడుతున్నారన్నారు. పొలాలకు వెళ్లాలన్నా, సోమవరప్పాడు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పటం లేదు.
> – బండి పోతురాజు, మల్లాయపాలెం

> **సంపద కేంద్రానికి స్థలం కేటాయించండి..**
> 
> బల్లికురవలో చెత్త నుంచి సంపద కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయింపులో జాప్యం జరుగుతోంది. చెరువు అంచులు, రోడ్ల వెంబడి వ్యర్థాలు పడుస్తున్నారు. వర్షాకాలంలో కుళ్లి రోడ్ల వెంబడి వెళ్లే వారికి దుర్గంధం వెదజల్లుతోంది. అంతే కాకుండా చెరువు జలాలు కలుషితం అవుతున్నాయి. తక్షణమే స్థల కేటాయింపుతో నిర్మాణ పనులు చేపట్టాలి.
> – జిర్రా కోటేశ్వరరావు, బల్లికురవ

స్థలం ఖాళీ చేయాలని అధికారుల బెదిరింపు

జే.పంగులూరు: తాతల కాలం నుంచి నివసిస్తున్న భూమిలో తనను ఖాళీ చేయించి పక్కనే పట్టా భూమి ఉన్న వ్యక్తికి కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఓ మహిళ తీవ్ర ఆవేదన చెందింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని బైటమంజులూరు గ్రామానికి చెందిన పేద మహిళ రత్నాకరం బుల్లచ్చమ్మ పూర్వీకుల నుంచి 75 సంవత్సరాలకు పైనే గ్రామంలోని డొంక పోరంబోకులో సర్వే నంబర్ 108–3లో నివశిస్తోంది.

6 ఎకరాల డొంక పోరంబోకు ఆక్రమణ..

బైటమంజులూరు గ్రామంలో డొంక పోరంబోకు భూమి సర్వే నెంబర్ 113–5, 109–3, 108–3, 80–1, 79–1,77–1, 76–1లలో సుమారు ఆరు ఎకరాల డొంక పోరంబోకు భూమి ఉందని బుల్లచ్చమ్మ తెలిపింది. ఆ భూములు అన్ని ఆక్రమణలకు గురై కొంత మంది కొత్తగా ఇల్లు నిర్మించుకోగా కొందరు పంటలు సాగు చేస్తున్నారని తెలిపింది. ప్రస్తుతం నేను 17 సెంట్లు తన తాతల కాలం నుంచి వచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకొని వాడుకుంటున్నామని తెలిపింది. నా స్థలం పక్కనే ఉన్న రెడ్డిచర్ల లక్ష్మీరాజ్యం అధికారులను అడ్డం పెట్టుకొని కలుపుకోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.


బుల్లచ్చమ్మ నివాసం ఉంటున్న ఇంటి వద్దకు వచ్చిన పోలీసులు

తహసీల్దార్, రెవెన్యూ అధికారుల బెదిరింపు..

పదే పదే రెవెన్యూ, పోలీసులు ఇంటికి వచ్చి ఖాళీ చేయాలని నన్ను ఇబ్బందులు పెడుతున్నారు. ప్రస్తుతం తనను తహశీల్దార్ తన ఆఫీసుకు పిలిచి బెదిరిస్తున్నాడని తెలిపింది. ఆ భూమిని ఖాళీ చేసి పక్కన ఉన్న భూమి యజమానికి ఇవ్వాలని చెప్పాడని పేర్కొంది. ఆదివారం కూడా పోలీసులు మా ఇంటి వద్దకు వచ్చి ఎస్సై స్టేషన్‌కు రమ్మనారని నన్ను ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేసింది.

> **ఆమె పట్టా భూమిలోకి వచ్చింది..**
> సర్వేయర్‌ను స్థలం వద్దకు పంపి కొలిపించాం. బుల్లచ్చమ్మ ఉంటున్న స్థలం పట్టా భూమిలోకి వచ్చింది. అందువలన ఆ భూమిని ఖాళీ చేయమని ఆమెకు చెప్పాం. డొంక పోరంబోకు భూమిలో నివాసం ఉండటం నేరం. అందువలననే ఆమెను ఖాళీ చేయమన్నాం.
> – సింగారావు, తహసీల్దార్

దర్జీల సంక్షేమానికి కృషిచేయాలి

చీరాల టౌన్: దర్జీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేసి ఆదుకోవాలని టైలర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీ.వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం పట్టణంలోని బెస్తపాలెంలోని కల్యాణ మండపంలో టైలర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ టైలర్లకు ఉన్న సమస్యలను గుర్తుంచుకుని గత వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో దర్జీలకు ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారన్నారు. దర్జీలకు ఉన్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు కూడా సహకారం అందించారన్నారు. నూతనంగా ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన సీఎం చంద్రబాబు దర్జీలకు ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించి తమను ఆదుకునేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా కోశాధికారిగా షేక్ ఆషాని ఎన్నుకున్నారు. అలానే చీరాల పట్టణ టైలర్స్ యూనియన్ కమిటీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎస్ఎం బాషా, నాయకులు మాధవరావు, భాస్కరరావు, జిలానీ, గౌస్ బాషా, సుబ్రమణ్యం, జాన్, హైసర్, సలీమ్ అధిక సంఖ్యలో టైలర్లు పాల్గొన్నారు.


కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు, నాయకులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత సాధ్యం


వాక్య సందేశం అందిస్తున్న బెన్‌హర్


పేరాలలో దేవుడి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

చీరాల రూరల్: యువత క్రమ శిక్షణతో కూడిన చదువులోనే కాక ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని అంతర్జాతీయ సువార్తికులు రూబెన్ బెన్‌హర్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటీనరీ లూథరన్ చర్చిలో యూత్‌లీగ్ ఆధ్వర్యంలో యూత్ సండే (యువజనుల ఆదివారం) ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా సంఘకాపరులు రెవరెండ్ పిల్లి దేవదాసు, నానిబాబులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఆదివారం చర్చిలో పాస్టర్లు నిర్వహించే ఆరాధనా క్రమాన్ని యూత్ సభ్యులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బెన్‌హర్ పాల్గొని దేవుని వాక్యసందేశం అందించారు. యువతి, యువకులు చెడు మార్గాలను విడనాడి సన్మార్గంలో దేవుని గుర్తెరిగి జీవించాలని సూచించారు. అలానే పేరాలలోని సెయింట్ మార్క్స్ లూథరన్ బ్రాంచ్ చర్చిలో ఆదివారం చిల్డ్రన్స్ సండే ఎంతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, యూత్‌లీగ్ సభ్యులు, సండే స్కూలు చిన్నారులు, సంఘస్తులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చీరాల రూరల్: శాకాహారం అమృతాహారమని.. శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పేరాల అంజనీపుత్ర మెర్కాబా పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు జీవహింస చేయరాదని, శాకాహారం తినండి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండండంటూ నినాదాలు చేశారు. తదనంతరం సభ్యులు మాట్లాడుతూ భూమండలంలో శాకాహారానికి మించిన ఆహారం మరొకటి లేదని తెలిపారు. దేవుడు తాను సృష్టిలో జీవులందరూ సమానమేనని నోరులేని మూగ జీవులను చంపి ఆహారంగా తీసుకోకూడదని, జీవహింస మహా పాపమని పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయలలో మంచి పోషకాలు ఉంటాయని తెలిపారు. ర్యాలీలో అధిక సంఖ్యలో ధ్యాన మందిరం సభ్యులు పాల్గొన్నారు.


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యాన మందిర సభ్యులు

స్వాములకు అన్నదాన వితరణ


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాలధారులు

మేదరమెట్ల: మాలధారణగాంచిన స్వాములకు కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పాత గుంటూరు రోడ్డులో గల అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో గణపతి మురుగన్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం డిసెంబర్ రెండో తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. నడికట్ల వెంకట హరీష్, అనూష దంపతులు అన్నదాన కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించగా మొత్తం 350 మంది స్వాములు అన్నదానంలో పాల్గొన్నట్లు సేవాసమితి సభ్యులు తెలిపారు.

గ్రావెల్ తరలిస్తున్న లారీలు స్వాధీనం

కారంచేడు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ వ్యర్థాలను తరలిస్తున్న లారీలను పోలీసలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వీ వెంకట్రావు వివరాల మేరకు.. ఆదివారం రాత్రి మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్‌లో సాధారణ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో మార్టూరు వైపు నుంచి చీరాల వైపునకు ఆరు టిప్పర్ లారీలు వచ్చాయన్నారు. ఈ లారీల్లో గ్రావెల్ వ్యర్థాలున్నాయని, వీటి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేకపోవడం వలన స్వాధీన పరుచుకొని మైనింగ్ అధికారులకు అప్పగించామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేసుకున్న గ్రామస్తులు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని దుద్దుకూరు గ్రామ పరిధిలోని వాగు అప్రోచ్ రోడ్ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ఉధృతికి గండి పడింది. దాంతో గ్రామానికి రాకపోకలు సాగించేందుకు ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధుల కోసం ఎదురు చూడకుండా గ్రామంలోని ప్రజలు రోడ్డును బాగు చేసేందుకు నడుంబిగించారు. రెండు ట్రక్కులు తెల్లరాయిని తెచ్చి దుద్దుకూరు వాగు అప్రోచ్‌రోడ్‌కు పడిన గండిని పూడ్చి వేసి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ వాగుపై నిర్మాణం చేసిన తూములు బీటలు బారి లో లెవెల్ బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. నాలుగు దశాబ్దాలు క్రితం నిర్మాణం చేసిన బ్రిడ్జి కావడంతో శిథిలావస్థకు చేరిందని ఏ సమయంలో కూలిపోతుందోనని భయంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరిన లో లెవెల్ బ్రిడ్జి స్థానంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గండిని పూడ్చిన గ్రామస్తులు


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఆశ్వయూజ మాసం రోహిణి నక్షత్రం, పంచమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

చల్లంగ చూడవమ్మా గంగమ్మ తల్లీ


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లికి ఆదివారం ఉదయం నుండి భక్తులు ప్రత్యేక పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యాల సమర్పణను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడాలని, పంట కాలువలు సాగు నీటితో కళకళలాడాలని కోరుకున్నారు. పంటలు బాగా పండుతాయని, మంచి దిగుబడులతో పాటు, గిట్టుబాటు ధరలను అమ్మవారు కల్పిస్తారని అన్నదాతల గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.